క్లుప్తంగా

మొక్కలే జీవకోటికి ఆధారం



రాజీవ్‌నగర్ నార్త్ పార్క్ ఆవరణలో మొక్కలు నాటుతున్న కమిటీ ప్రతినిధులు

కూర్మన్నపాలెం: మొక్కలు జీవకోటికి జీవనాధారమని, వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని 85వ వార్డు రాజీవ్‌నగర్ నార్త్‌పార్క్ కమిటీ ప్రతినిధులు ధనుంజయ్, ప్రసాద్ అన్నారు. నార్త్‌పార్క్ ఆవరణలో స్వచ్ఛ భారత్ నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషి బతకడానికి ఆహారం, నీరుతోపాటు గాలి అవసరమన్నారు. స్వచ్ఛమైన గాలి దొరకక అనేక రకాల వ్యాధులతో మానవాళి సతమతమవుతున్నారన్నారు. కార్యక్రమంలో గణేష్, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దాతకు సత్కారం



రామ అప్పారావును సత్కరిస్తున్న నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలలో రామాలయ పునర్నిర్మాణానికి అంకురార్పణచేసిన వినియోగదారుల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ పట్టా రామ అప్పారావును గ్రామ కమిటీ, ఆలయ కమిటీ నాయకులు ఘనంగా సత్కరించారు. మొదటి హయ్యర్ పెన్షన్‌తో పాటు రెండు లక్షల విరాళం ఇచ్చేందుకు ముందుకు వచ్చిన రామ అప్పారావును ఆదర్శంగా తీసుకొని గ్రామంలోని విందుల వంశీ శ్రీనివాస్, దాసరి వెంకటరమణలు చెరో లక్ష విరాళం అందించేందుకు ముందుకు వచ్చారని అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బలిరెడ్డి శ్రీను, విందు వంశీ సాయి, సాయిన సన్యాసిరావు, బుదిరెడ్డి అప్పారావు, కన్నారావు, ముచ్చల వంశీ సాయి, ఈశ్వరరావు, మరిశా నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మానవత్వం పరిమళించిన వేళ



అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుంచయ్య

పెదగంట్యాడ: అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించి ఓ వ్యక్తి మానవత్వం చాటుకున్నాడు. మండలంలోని దయాల్‌నగర్‌లోని సాయిబాబా ఆలయం ఎదురుగా ఉన్న శివాలయం ఆర్చి వద్ద ఓ యాచకుడు నిత్యం బిచ్చం ఎత్తుకుంటూ జీవించేవాడు. అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందిచారు. అక్కడకు చేరుకున్న న్యూపోర్టు పోలీసులు మృతుడు అనాథని, అతనికి సంబంధించిన వారు ఎవరూ లేరని నిర్ధారించారు. విషయం తెలుసుకున్న ఉక్కు రిటైర్డ్ ఉద్యోగి గొందేశి కుంచయ్య తన సొంత నిధులతో పోలీసుల సమక్షంలోనే సంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు జరిపించారు.

దంత వైద్య శిబిరానికి స్పందన




దంతపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు భానోజీ తోటలో క్రీస్తు సంఘం చర్చి పాస్టర్ విశ్వనాథం ఆధ్వర్యంలో వి డెంటల్ కేర్ సహకారంతో ఆదివారం నిర్వహించిన దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు ప్రారంభించారు. సుమారు 100 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 65వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మద్దాల అప్పారావు, హెచ్ కొండలరావు, డాక్టర్ రావు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

గాజువాక: స్థానిక డిజైర్ సొసైటీ చిన్నారులకు బీజేపీ నాయకులు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు జన్మదినం సందర్భంగా ఆ పార్టీ నాయకుడు కరణంరెడ్డి చేతులమీదుగా చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శంకరరావు, నాగేశ్వరరావు, ప్రకాష్, వెంకటరావు పాల్గొన్నారు.

కందిపప్పు కట్!



కూటమి ప్రభుత్వం కోతలకు పెద్దపేట వేస్తోంది. ఓ వైపు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా.. మరో వైపు నిబంధనలతో పథకాలకు పేదలను దూరం చేస్తుంది. తాము అధికారంలోకి వస్తే రేషన్ డిపోల ద్వారా అన్ని సరకులు ఇస్తామని హామీలు ఇచ్చి .. తీరా కంది పప్పుకు ఎగనామం పెట్టారు. బహిరంగ మార్కెట్‌లో ధర బాగా ఉండడంతో పేదలు పప్పు అన్నానికి కూడా నోచుకోవడం లేదు.

- రేషన్ డిపోల్లో కానరాని వైనం
- బియ్యంతో సరి
- బహిరంగ మార్కెట్‌లో ధర రూ.160

పెదగంట్యాడ: రేషన్ డిపోల్లో కందిపప్పు పంపిణీ చేయకపోవడంతో కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారు. బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేసే స్తోమత లేకపోవడంతో కంది పప్పు కలేనా అంటూ నిట్టూరుస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత నిత్యావసరాల ధరలకు రెక్కలు వచ్చాయి. కందిపప్పు ధరైతే ఎన్నడూ లేని విధంగా పెరిగిపోయింది. పౌర సరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేసే కందిపప్పును వినియోగించుకుందామని తెల్ల రేషన్ కార్డుదారులు ఆలోచిస్తుంటే ప్రభుత్వం వారి ఆశలపై నీళ్లు చల్లింది. ఈ ఏడాది జనవరి నెలలో కొద్దిమందికి నామమాత్రంగా కంది పప్పు పంపిణీ చేశారు. ఫిబ్రవరిలో బియ్యంతో పాటు కొంతమందికి పంచదార పంపిణీ చేసి సరిపెట్టేశారు. మార్చిలో అయినా కందిపప్పు ఇస్తారని కార్డుదారులు ఆశగా ఎదురు చూశారు. ఆ నెలలో కూడా కందిపప్పు సరఫరా చేయకపోవడంతో తెల్లకార్డు దారులు తెల్లబోయారు. ప్రభుత్వ తీరును ఎండగట్టారు.. ఆ తర్వాత ఇప్పటి వరకూ ఒక్క నెల కూడా కంది పప్పు పంపిణీ చేయలేదు.

బియ్యంతో సరిపెట్టుకో..

ప్రతి నెలా రేషన్ కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తున్న ఉచిత బియ్యం మాత్రమే అందజేస్తున్నారు. ఎన్నికల్లో రేషన్ డిపోల ద్వారా అన్ని రకాల పప్పులు రాయితీ ధరలకు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి నెలా ఇచ్చే సరకులు సక్రమంగా ఇవ్వడం లేదు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించడం లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. నాలుగు నెలలుగా బియ్యం, చక్కెర తప్పా మిగిలిన సరకులు ఇవ్వడం లేదు. నాలుగు నెలలుగా కందిపప్పు ఇవ్వకపోవడంతో స్థానికులు రేషన్ డిపోదారులను నిలదీస్తున్నారు. కంది పప్పు సరఫరా లేదని పంచదార ఇచ్చిన మేరకు అయిపోయిందని. స్టాకు రావాల్సి ఉందని వారు చెబుతున్నారని కార్డుదారులు వాపోతున్నారు.



కనుమరుగైన పౌర సరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేసే కంది పప్పు

పేదలపై చిన్నచూపు

పెదగంట్యాడ మండల పరిధిలో 32825 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో అధిక శాతం కూలిపనులు చేసుకునే వారే. ప్రభుత్వం పంపిణీ చేసే నిత్యావసరాలే వారికి ఆధారం. ఇందులో కంది పప్పు పూర్తిగా నిలిపివేశారు. పంచదార కూడా పూర్తి స్థాయిలో ఇవ్వకుండా అరకొరగా పంపిణీ చేస్తూ ప్రభుత్వం పేదల పై చిన్నచూపు చూస్తోంది.

గత ప్రభుత్వంలో రూ.67కే..

బయట మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ. 150 నుంచి రూ.160 పలుకుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఎండీయూ వాహనాల ద్వారా కిలో రూ.67కి పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలలు మాత్రమే ఎండీయూ వాహనాల ద్వారా అరకొరగా కందిపప్పు పంపిణీ చేసి చేతులెత్తేయడంతో పేద ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేస్తారేమోనని చూస్తే అక్కడ కూడా నో స్టాక్ అంటూ చెప్పేస్తున్నారు.



పెదగంట్యాడలో ఎండీయూ వాహనం వద్ద సరుకులు తీసుకుంటున్న కార్డుదారులు(ఫైల్)

కందిపప్పు ఇవ్వడం లేదు



బియ్యంతో పాటు పంచదార మాత్రమే ఇస్తున్నారు. కంది పప్పు ఇవ్వడం లేదు. అసలే మార్కెట్లో నిత్యవసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దీనికి తోడు ప్రభుత్వం కూడా పేదలకు రేషన్ ద్వారా సరకులు సక్రమంగా అందించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. కందిపప్పు పంపిణీ చేసే ఏర్పాటు చేయాలి.

– గుడ్ల గురమ్మ, కండిపల్లి వీధి, పెదగంట్యాడ

ఇలా అయితే ఎలా..



ప్రభుత్వం రేషన్ సరకులు పేదలకు పూర్తి స్థాయిలో పంపిణీ చేయడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎండీయూ వాహనాల ద్వారా బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార, గోధుమ పిండి తదితర సరకులు ప్రతి నెల పంపిణీ చేసేవారు. ప్రస్తుత ప్రభుత్వం బియ్యం, పంచదార ఇచ్చి చేతులు దులుపుకుంటుంది. ప్రతి నెలా కందిపప్పు రాలేదని చెబుతున్నారు. తెల్ల రేషన్‌కార్డుదారులకు ఇచ్చే కందిపప్పు కూడా సరిగ్గా ఇవ్వకపోతే ఎలా?.

– జి. వెంకటలక్ష్మి, నెల్లిముక్కు

వస్తే పంపిణీ చేస్తాం



రేషన్ డిపోల ద్వారా లబ్ధిదారులకు బియ్యం, పంచదార సరఫరా చేస్తున్నాం. కంది పప్పు ఇంకా రాలేదు. వచ్చిన వెంటనే అందరికీ పంపిణీ చేస్తాం.

– తవ్వా కృష్ణ ఏఎస్‌వో, పౌరసరఫరాల శాఖ, గాజువాక

గడప గడపకూ కూటమి మోసాలు

- చంద్రబాబువి ఫేక్ రాజకీయాలు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు
- బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం ప్రారంభం



బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

గాజువాక: చంద్రబాబు పాలనలో చోటు చేసుకొంటున్న అవినీతి, మోసాలను ప్రతి గడపకు వివరించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని గాజువాకలో ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమి మోసాలను ప్రతి ఇంటికీ విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. చంద్రబాబు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించాలన్నారు. కూటమి పాలనలో విశ్వసనీయ రాజకీయాలు లేకుండా పోయాయన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అంటే విలువలు విశ్వసనీయతకు నిదర్శమన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అధికారం చేపట్టిన మరుక్షణం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. కూటమి నాయకులు సూపర్ సిక్స్‌తోపాటు 140కి పైగా హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత వాటిని విస్మరించారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలందరూ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి రీకాలింగ్ బాబూస్ మేనిఫెస్టో పేరిట చంద్రబాబు హామీలన్నీ ప్రజలకు గుర్తు చేయాలన్నారు.

గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న అడుగు జాడల్లో ప్రతి కార్యకర్త అడుగు వేసి కూటమి మోసాలను ఎండగట్టాలన్నారు. ఈ ఉద్యమంలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని కోరారు. ప్రజలను మోసం చేస్తున్న కూటమి విధానాలను నిలదీయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, నాయకులు పేడాడ రమణి కుమారి, ఉరుకూటి చందు, మహ్మద్ ఇమ్రాన్, భూపతిరాజు సుజాత, గుడివాడ లతీష్, రాజాన వెంకటరావు, పల్లా చినతల్లి, వార్డు అధ్యక్షులు ధర్మాల శ్రీను, మద్దాల అప్పారావు, పెదిరెడ్ల ఈశ్వరరావు, పల్లా సురేష్, సంగ్రాన నూకరాజు, కొణతాల రాము, భూపతిరాజు శ్రీనివాసరాజు, షౌకత్ అలీ, గొందేశి బుజ్జి, మంత్రి శంకరనారాయణ, రావాడ శివ, మహాలక్ష్మినాయుడు, పూర్ణానంద శర్మ, దాడి నూకరాజు, కోమటి శ్రీను, బొడ్డ గోవింద్, రంబ నారాయణమూర్తి, అనుబంధ సంఘాల నాయకులు ఉరుకూటి అప్పారావు, మార్టుపూడి పరదేశి, చిక్కా సత్యనారాయణ, జీలకర్ర నాగేంద్ర, ఎస్ఎండీ గౌస్, గొందేశి వెంకట రమణారెడ్డి, రోజారాణి, శిరీష, వరలక్ష్మి, చిత్రాడ వెంకట రమణ, ఇల్లపు రాము, బోడి వెంకటేష్, గుర్రం శ్రీను, సిరట్ల శ్రీనివాస్ (వాసు), జాన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వార్డు, జిల్లా,అనుబంధ సంఘాల నాయకులు

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు



వుడాకాలనీలో ప్రత్యేక అలంకరణలో ప్రసన్న వెంకన్న



దయాల్‌నగర్‌లో కల్యాణ వే ంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ: తొలి ఏకాదశి సందర్భంగా మండలంలోని ఆలయాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. దయాల్‌నగర్ కొండపై వేంచేసియున్న కల్యాణ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ ధర్మకర్త తిప్పల రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఉక్కు ఆలయంలో వేంకటేశ్వరస్వామి

- వినాయకనగర్ వుడా కాలనీలో వేంచేసియున్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు.
- జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కు రామాలయంలో తొలి ఏకాదశి పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచే పూజలు ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అగనంపూడి: తొలి ఏకాదశిని పురస్కరించుకొని ఆదివారం 79వ వార్డు అగనంపూడి శాంతినగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అగనంపూడి పరిసర నిర్వాసితకాలనీల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త ఈకే చారి దంపతుల పర్యవేక్షణలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణ స్వామి, కమిటీ ప్రతినిధులు సాయిబు నాయుడు, నరసింగరావు మాస్టార్, కృష్ణారావు, సోమశేఖర్, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, గురునాథరావు, సత్యనారాయణ, నాగలక్ష్మి, మోహిని పాల్గొన్నారు.



అభిషేకాలు జరిపిస్తున్న భక్తులు



శాంతినగర్‌లో వెంకన్నకు పూజలు చేస్తున్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-1 కొండపై వెలిసిన వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. ప్రధానార్చకులు భావనారాయణ స్వామి, అర్చకులు మనోజ్ స్వామి, హరినారాయణ స్వామి నేతృత్వంలో ఆదివారం ఉదయం ఆలయంలో సహస్ర నామార్చన చేశారు. ఆ తర్వాత విష్ణు సహస్ర నామార్చన, భగవద్గీ పారాయణ చేశారు. సాయంత్రం నక్షత్ర హారతి ఇచ్చారు. భక్తులు కోలాటాలు, భజనలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

సందడిగా తిరుగుయాత్ర

అగనంపూడి: అగనంపూడిలోని జగన్నాథస్వామి ఆలయంలో రథోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆఖరి రోజు జగన్నాథుడు కల్కి అవతారంతో దర్శనమిచ్చారు. తిరుగురథయాత్రలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధనను 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆలయ అర్చక కుటుంబీకులు గురు త్రినాథ్, మోహన్ కుటుంబీకులు, ఆలయ కమిటీ చైర్మన్ కరణం పైడిరాజు, ఈవో పద్మావతి ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు.



అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు

కార్యక్రమంలో గొల్లవిల్లి వెంకటరావు, కనకభవానీ, కరణం సత్యారావు, జగదీష్, చిత్తా గణేష్, కొరాయి జగదీష్ ,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు టీకాలు

అగనంపూడి: పెంపుడు కుక్కలకు ఎప్పటికప్పుడు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయాల్సి ఉందని అగనంపూడి పశువైద్యశాల వైద్యాధికారి డాక్టర్ పి.లావణ్య అన్నారు. జూనోసిస్ డే సందర్భంగా అగనంపూడి పశువైద్యశాలలో పెంపుడుకుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. కార్యక్రమంలో బలిరెడ్డి సత్యనారాయణ, దానబాల పైడికొండ, బండారు చందు, సన్యాసిరావు, పెద అప్పారావు, బి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ నేత బాబూ జగ్జీవన్‌రామ్



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి తదితరులు

పెదగంట్యాడ: దేశం గర్వించదగ్గ నాయకుడు భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. పెదగంట్యాడలోని పార్టీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి పురస్కరించుకుని ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, గంట్యాడ గురుమూర్తి, మధుసూదన్‌రెడ్డి, వెంకటేష్, కాకినాడ పెంటారావు ఈశ్వరి, ఉమ, కొయ్య భారతి తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎలీషా, గురుమూర్తి, పరదేశి



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీహెచ్‌ఈఎల్ ఈడీ సుబ్రహ్మణ్యం

- పెదగంట్యాడ కూడలిలో బాబూ జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ విశాఖ జిల్లా అధ్యక్షుడు పేరిలా ఎలీషా మాదిగ మాట్లాడుతూ పేదల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, గంట్యాడ గురుమూర్తి,మార్టుపూడి పరదేశి, 75వ వార్డు అధ్యక్షుడు గొందేశి శ్రీనివాసరెడ్డి, 76వ వార్డు అధ్యక్షుడు మంత్రి శంకరనారాయణ, గంట్యాడ గోవిందరాజు, పెద్దాడ సోమునాయుడు, పల్లా చినతల్లి, కొయ్య భారతి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు స్ఫూర్తిదాయకం

గాజువాక: మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని బీహెచ్‌ఈఎల్, హెచ్‌పీవీపీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. బీహెచ్‌ఈఎల్ ఈడీ జి.సుబ్రహ్మణ్యం, ఏజీఎం (హెచ్‌ఆర్) తదితరులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అణగారిన అన్నివర్గాల అభ్యున్నతి కోసం పని చేశారని పేర్కొన్నారు. వారి సేవలు దేశంలో అన్ని తరాలవారికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొల్లి దేముడు, ప్రతినిధులు ఎ.మధుసూదన్, ఎస్.జగన్నాథం, బొండా బాబూరావు,

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

ఉక్కునగరం: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్‌కు స్టీల్‌ప్లాంట్‌లో ఘన నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ గుర్తింపు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో దళిత నాయకులు డి. సంపూర్ణం, వై.టి. దాస్ తదితరులురై జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తొడన్న, ప్రధానకార్యదర్శి బయ్యే మల్లయ్య, జి. సత్యనారాయణ, పుల్లారావు, కె.వి. రత్నం, బి.డి. నాయక్, ఫణీంద్ర, ప్రసన్న కుమార్, తిమోతి, రామకృష్ణ, పోలరాజు తదితరులు పాల్గొన్నారు.



ఉక్కునగరంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు